


కొమ్ము తలపాగాతో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్
మార్చ్‌ఫాస్ట్

సివిల్ పవర్ చూపుతాం!

కలెక్టర్లు.. ఎస్పీలూ క్రీడా పోటీలు ఊహించగలమా.. కాస్త కష్టమే.. ఎందుకంటే జిల్లాకో కలెక్టర్.. ఎస్పీ ఉంటారు.. వీళ్ల మధ్య క్రీడాపోటీలు ఎలా జరుగుతాయని ఆశ్చర్యపోతున్నారా!? 2024 -25 సివిల్ సర్వీసెస్ ఆలిండియా పురుషులు.. మహిళల హాకీ టోర్నమెంట్ కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం నుంచి ప్రారంభమైంది.. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన క్రీడాకారులు 44 జట్లుగా ఏర్పడి తలపడుతున్నారు.. మన మధ్యకు వచ్చి ఈ నెల 28వ తేదీ వరకూ మేమూ ఆడతాం.. ప్రతిభ చాటుతాం అంటున్నారు.. - వివరాలు 6లో




క్రీడాజ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్, ఎస్పీ


మా ఆట చూపుతాం : క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్



మార్కెట్.. చిక్కేనా!

సండే.. చికెన్ ఆశలు

వండుకు తింటే.. ప్రభావం ఉండదంటున్న వైద్యులు



ఆదివారం అంటేనే నాన్‌వెజ్ డే. మాంసాహార ప్రియులు ఎప్పుడొస్తుందా ఎదురుచూసే రోజు. ఆ రోజు ముక్కలేనిదే ముద్ద దిగదు.. చికెన్, మటన్, చేప, రొయ్యలకు డిమాండ్.. వీటిలో చికెన్ అంటే పెద్దలు, పిల్లలూ ఇష్టపడతారు. అందులోనూ చికెన్ బిర్యానీదే పైచేయి. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ఈ ఆదివారం మాంసాహార ప్రియులు ఎలా స్పంది స్తారో ననే ఉత్కంఠ నెలకొంది. వారాంతపు రోజు కావడంతో ఈ ఒక్కరోజే వందలాది టన్నుల చికెన్ అమ్మకాలు, లక్షలాది గుడ్ల అమ్మకాలు సాగేవి. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ప్రభావంతో కొన్నిచోట్ల చికెన్ అమ్మకాలు పడిపోయాయి. హోటళ్లలోనూ ఆర్డర్లు పడిపోయాయి. ఈ నేపథ్యంలో నష్ట నివారణకు కోళ్ల పరిశ్రమ రంగంలోకి దిగింది. ప్రభుత్వం కూడా కొంత అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టింది. చికెన్ వండుకుని తినడం వల్ల ఎలాంటి హాని జరగదని వైద్యులు సైతం చెబుతున్నారు. కోడి గుడ్ల విషయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగు తోంది. ఆదివారం రానేవచ్చింది.. నేడు పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన పరిశ్రమ వర్గాల్లో నెలకొంది. సాధారణ పరిస్థితి ఏర్పడితేనే కోళ్ల పరిశ్రమ బయటపడే అవకాశం ఉంది.

అనపర్తి/మండపేట/ఉండ్రాజవరం/ అమలాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వచ్చిందని తెలియగానే చాలాచోట్ల చికెన్ దుకాణాలు మూతపడ్డాయి. బర్డ్‌ఫ్లూ సోకిన కోడిని సైతం వండుకుని తింటే మనుషులకు ఏమీ కాదని ఒకవైపు ప్రచారం జరుగుతున్నా ఇదిగో పులి అంటే అదిగో మేక అన్న చందంగా అసత్య ప్రచారాలతో కోడిమాంసం, గుడ్ల అమ్మకాలు పడిపోయాయి. దీంతో రైతులు కోళ్ల రేట్లను గణనీయంగా తగ్గించారు. మొన్నటి వరకు లైవ్ బాయిలర్ కిలో రూ.115 నుంచి 120 ఉండగా ప్రస్తుతం అది రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది. ఫారం కోడి ధర లైవ్ రూ.90 పలుకగా ఇప్పుడు రూ.70కు ఇస్తున్నారు. ఇక గుడ్ల ధర విషయానికి వస్తే మొన్నటి వరకు పేపరు ధర రూ.4.90 ఉండగా నేడు రూ.4.55కు పడిపోయింది. కొన్ని చోట్ల బ్రీడర్లు మరింత దిగువకు కొనుగోలు చేస్తున్నారని పరిశ్రమ వర్గాలు ఒకటే గగ్గోలు పెడుతున్నాయి. మరోవైపు పౌల్ట్రీల వద్ద బర్డ్‌ఫ్లూ సోకకుండా తమ కోళ్లను రక్షించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్క కానూరు మినహా మిగిలినచోట్ల బర్డ్‌ఫ్లూ వ్యాపించిన ఘటనలు లేవు. అయినా మొత్తం మార్కెట్‌పై బర్డ్‌ఫ్లూ ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోనసీమలో గుడ్లు ఇవ్వండి!

కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకూ ఎక్కడ ఒక్క బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కాలేదు. జిల్లాలో 52 కమర్షియల్ పౌల్ట్రీ ఫార్మ్‌లో 32 లక్షల కోళ్లు, బ్యాక్యార్డ్ పౌల్ట్రీల్లో 24 లక్షల కోళ్లు ఉన్నాయి. వీటిలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లలో తిరిగి కోడిగుడ్లను బాగా ఉడికించి పిల్లలకు అందించండి. జిల్లాలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కోళ్లు, కోళ్ల ఉత్పత్తులు జిల్లాలోకి రావడంపై ఆంక్షలు విధించాం. బర్డ్‌ఫ్లూ కేసులు లేనందున జిల్లాలోకి అనుమతించండి. మాంసం విక్రయదారులపై ఆంక్షలు విధించవద్దు.

\- మహేష్‌కుమార్, కలెక్టర్

మటన్‌కు డిమాండ్.. కానీ..

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చికెన్‌ప్రియులను బర్డ్‌ఫ్లూ భయపెడుతుండడంతో గత కొద్దిరోజులుగా రాజమహేంద్రవరం సిటీలో చికెన్ అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. సిటీలోనే ప్రధాన కోళ్ల మార్కెట్‌గా పేరొందిన జాంపేట కోళ్ల మార్కెట్ శనివారం దాదాపుగా బోసిపోయి కనిపించింది. ఇదిలా ఉంటే బర్డ్‌ఫ్లూ భయంతో చాలా హోటళ్లలో మెనూ మారిపోయింది. కర్రీ పాయింట్లలోనూ చికెన్‌కు ప్రాధాన్యం తగ్గింది. చికెన్ స్థానంలో కొత్తగా మటన్ వచ్చి చేరుతోంది. చాలామంది హోటల్ యజమానులు చికెన్ వెరైటీలను తగ్గించేసి మటన్ ప్రమోట్ చేస్తున్నారు. దీంతో మటన్ వ్యాపారులు ఒక్కసారిగా ధరలు పెంచేశారు. బర్డ్‌ఫ్లూ ముందు వరకూ కిలో రూ.800-రూ.880 ఉన్న కిలో మటన్ ధర ఇప్పుడు రూ.950కి చేరి సామాన్యులకు అందుబాటులో లేకపోయింది.



- బర్డ్‌ఫ్లూ దెబ్బకు మార్కెట్ కుదేలు
- చికెన్‌కు దూరమైన జనం
- తినేందుకు జంకుతున్న వైనం
- ఏమీ కాదంటున్న వైద్యులు
- అయినా మారని తీరు
- అసత్య ప్రచారాలతో నష్టాలు
- పడిన గుడ్ల వినియోగం
- రూ.4.50కు గుడ్డు ధర
- చికెన్ ధర తగ్గుముఖం
- యజమానుల లబోదిబో

కోట్లలో నష్టపోతున్నాం..

రాష్ట్రంలో కోడిగుడ్ల ఎగుమతులపై బర్డ్‌ఫ్లూ ప్రభావం పడడం వల్ల పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్రంగా నష్టం జరుగుతోంది. దీనివల్ల రోజుకు రూ.2.5 కోట్లు నష్టపోతున్నాం. ఇక మాంసానికి విక్రయించే కోళ్ల నష్టం రోజుకు సుమారు రూ.కోటి వరకు ఉంటుంది. కోడిగుడ్లు, మాంసానికి విక్రయించే కోళ్ల వాహనాలను రాష్ట్ర సరిహద్దుల్లో నిలిపివేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతుల నిలుపుదలతో పాటు స్థానికంగానూ గుడ్ల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. అంగన్‌వాడీ కేంద్రాలకు, మధ్యాహ్న భోజన పథకానికీ గుడ్లను నిలిపివేశారు.

\- కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



సన్‌డే..ఆశలు

చికెన్ అమ్మకాలు గణనీయంగా పడిపోవడంతో మొన్నటి వరకు కిలో రూ.220 అమ్మిన స్కిన్‌లెస్ బాయిలర్ మాంసం ధర నేడు రూ.190కి పడింది. అయినప్పటికీ తగ్గకుండా ధర నిలబెట్టేందుకు పరిశ్రమ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే వైద్యులు సైతం చికెన్, గుడ్లు పచ్చివి మాత్రమే తినకూడదని.. వండిన తర్వాత ఎలాంటి వైరస్ ఉండదని.. కాబట్టి తినొచ్చని చెబుతుండడంతో ఆదివారం మార్కెట్ తమను ఆదుకుంటుందనే ఆశతో కోళ్ల రైతులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం 30 వేల బాయిలర్ కోళ్ల విక్రయాలు జరుగుతుంటాయి. ఆదివారం 50 వేలకుపైబడి బాయిలర్ కోళ్లను విక్రయిస్తారు. లేయర్ కోళ్ల విషయానికి వస్తే 25 వేల కోళ్ల విక్రయాలు సాగుతుండగా, ఆదివారం ఒక్కరోజే 40 వేల కోళ్లు విక్రయిస్తారు. ఈ ఆదివారం మార్కెట్ చిక్కాలని ఆశగా ఉన్నారు.



గుడ్డుకు.. బ్యాడ్ డేస్..

బర్డ్‌ఫ్లూ దెబ్బకు చికెన్ వినియోగంతోపాటు గుడ్ల విక్రయాలు గణనీయంగా తగ్గాయి. నిన్న మొన్నటి వరకు రూ.4.90 పలికిన గుడ్డు ధర ఇప్పుడు రూ.4.55కు పడిపోయింది. చిల్లర ధర మాత్రం నేటికీ రూ.6లు ఉన్నప్పటికీ వినియోగదారులు మొగ్గు చూపకపోవడంతో చిల్లర అమ్మకాలు నిలిచిపోయాయి.ఈ ప్రభావం కేక్‌లపై కూడా పడింది. చాలామంది కేక్‌లు తినేందుకు ఇష్టపడడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గుడ్ల ఉత్పత్తి 1.30 కోట్ల మేర ఉండగా స్థానికంగా వినియోగం 30 శాతం ఉంటుంది. మిగిలిన 70 శాతం గుడ్లు పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అస్సాం, మేఘాలయ తదితర రాష్ట్రాలకు ఎగుమతవుతాయి. ఈశాన్య రాష్ట్రాల్లో గుడ్ల ఉత్పత్తి తగ్గడంతో మన ఎగుమతులపై ఎలాంటి ప్రభావం పడలేదు. కానీ బ్రీడర్లు బర్డ్‌ఫ్లూ భూతం చూపి కొంత ధర తగ్గించినట్టు చెబుతున్నారు.

లెక్కతేలిన ఎమ్మెల్సీ ఓటర్లు

మొత్తం ఓటర్లు 3,14,984
అత్యధికం కాకినాడ జిల్లా.. ఓటర్లు 70,504
అత్యల్పం అల్లూరు జిల్లా .. ఓటర్లు 4,669
తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు.. 62,970
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఓటర్లు.. 64,471 6



ఏమండోయ్.. మేమండి!

సోషల్ మీడియాలో దూసుకుపోతున్న దంపతులు
6 లక్షల మంది అభిమానం సొంతం
మొత్తం నాలుగు వేల వీడియోలతో ఓ రికార్డు
కడియపులంక నుంచి తెలుగువాళ్ల ప్రపంచంలోకి.. 6

మందపల్లికి పోటెత్తిన భక్తజనం


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కొత్తపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ.రాజమౌళి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రం అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, తహసీల్దార్ వైరాం బాబు, సిబ్బంది పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి ఒక్కరోజుకు రూ.1,52,940 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో సాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జలవనరులు, డ్రైనేజీ విభాగ ఇంజనీర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో 1.65 లక్షల ఎకరాలలో రైతులు సాగు చేపట్టారన్నారు. మార్చి నెలఖారులో గోదావరి నది ఎగువ భాగంలో నీటి ప్రవాహం తగ్గి సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టామన్నారు. సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు సుమారు రూ.1.8 కోట్లతో డ్రైనేజీలపై అడ్డుకట్టలు వేసి ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీటిని సరఫరా చేయడం, కాలువల గేట్లు షట్టర్లు మరమ్మతులు, కాలువ గండ్లు పూడ్చడం వంటి రిపేర్లు చేపడతామన్నారు. సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు 70 ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీలలో 41 పనులు కోసం రూ.92 లక్షల అంచనాలతో డ్రైనేజీ విభాగం ద్వారా ప్రతిపాదనలు సమగ్ర వివరాలతో రూపొందించాలని త్వరలో అంచనాలు రూపొందించి పనులకు నిధులు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. అదే విధంగా జలవనరుల విభాగం ద్వారా కాలువ గేట్లు షట్టర్ల మరమ్మతులు, గండ్లు పూడ్చడం కోసం 11 పనులను రూ.16 లక్షలతో నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. ఈ పనులను వ్యవసాయశాఖ, డ్రైనేజీ జల వనరుల శాఖ పర్యవేక్షణలో నీటి వినియోగదారుల సంఘాలకు నామినేషన్ ప్రాతిపదికన అప్పగించాలని ఆదేశించారు. వారాబందీ విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తూ సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేయాలని ఆదేశించారు. రామచంద్రపురం, మండపేట నియోజవర్గాలలో వరినాట్లు ముందుగా వేయడం వల్ల పంటకోతకు ముందుగానే వస్తుందని ఆ నియోజకవర్గాలలో పెద్దగా నీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. తూర్పుడెల్టాలో పంట కోత ముందుగా వస్తుందని ఆ నీటిని సెంట్రల్ డెల్టాకు మళ్లించాలని ఇంజనీర్లకు సూచించారు. ఐ.పోలవరం మండలంలో 33, కాట్రేనికోనలో 4, అల్లవరంలో 5, ఉప్పలగుప్తంలో 4, మలికిపురంలో 3, సఖినేటిపల్లిలో 3, రాజోలు 3, మామిడికుదురు 3, కొత్తపేటలో 2, కె.గంగవరంలో 3, కాజులూరులో 1, రాయవరంలో 1, ఆలమూరులో 2, కపిలేశ్వరపురంలో 1, రామచంద్రపురం మండలంలో 1 డ్రైనేజీ పనులకు ప్రతిపాదించినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం.కిషోర్, జలవనరుల శాఖ డివిజనల్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏవండోయ్ మేమండీ..



సోషల్ మీడియాలో దూసుకుపోతున్న దంపతులు
6 లక్షల మంది అభిమానం సొంతం


కుకింగ్ వీడియోలో..

కడియం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):

'ఏవండోయ్' అంటూ ఒకాయన తన జీవిత భాగస్వామితో కలిసి యూట్యూబ్, ఇన్‌స్టా, ఫేస్ బుక్‌లో చెప్పే ముచ్చట్లు, చూపించే వీడియోలకు లక్షలాది మంది ఫాలోవర్స్ ఫ్యాన్స్‌గా మారిపోయారు. తన భార్యను భుజానకెత్తుకుని తిరుపతి మెట్లు ఎక్కి ఫేమస్ అయిన రోజు నుంచే 'సోషల్ మీడియా'ను కూడా భుజానకెత్తుకుని సెలబ్రిటీలుగా మారిపోయారు.. తూర్పుగోదావరి జిల్లా కడియపులంకకు చెందిన వరదా సత్యనారాయణమూర్తి (సత్తిబాబు)- లావణ్య దంపతుల ఏవండోయ్ అనే పలకరింపు ఫేమస్ అయ్యి లక్షలాది మంది అభిమానాన్ని మూటకట్టింది..



అభిమానుల ఆదరణ మరిచిపోలేం..

కడియపులంకలో లారీ ట్రాన్స్‌పోర్టు నిర్వహించేవారమని, సోషల్ మీడియా ద్వారా లభించిన ఆదరణ మర్చిపోలేమని సత్తిబాబు-లావణ్య దంపతులు తెలిపారు. కేవలం ప్రజలకు మంచి సందేశాత్మకమైన సమాచారాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో తాము చేస్తున్న వీడియోలకు వస్తున్న గుర్తింపు జీవితంలో మరువలేమని అన్నారు. తమను ఆదరిస్తున్న ప్రతీఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.



ఒకాయన మూడేళ్ల క్రితం తన భార్యను భుజానకెత్తుకుని తిరుమల మెట్లు ఎక్కారు. దీంతో ఒక్కరోజులోనే సోషల్ మీడియాలో స్టార్ అయిపోయారు. ఆ వీడియో చాలా రాష్ట్రాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోతో ఆ భార్యాభర్తలు ఫేమస్ అయిపోయారు. సెలబ్రిటీలుగా మారిపోయారు. వారే తూర్పుగోదావరి జిల్లా కడియపులంకకు చెందిన వరదా సత్యనారాయణమూర్తి (సత్తిబాబు)- లావణ్య దంపతులు. 'ఏవండోయ్' అంటూ వీళ్లు చెప్పే ముచ్చట్లు..చూపించే అందమైన పరిసరాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు అబ్బురపరుస్తాయి. మూడేళ్ల క్రితం వరకు వారు ఎవరికీ తెలియదు. అయితే కుటుంబ సభ్యులతో కలిసి కాలినడకన తిరుమల కొండ ఎక్కుతూ కొంత దూరం సత్తిబాబు భార్య లావణ్యను భుజాల మీద ఎత్తుకుని మెట్లు ఎక్కడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. అన్ని న్యూస్ ఛానళ్లలో అదే న్యూస్ అయిపోయింది. దీంతో వారు ఆ గుర్తింపును కొనసాగించాలనుకుని సోషల్ మీడియాలో అడుగుపెట్టారు.

6 లక్షల మంది ఫాలోవర్స్




సత్తిబాబు కడియపులంక పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఈ దంపతులకు సుమారు 6 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. దీంతో వారు ఎలాంటి మెసేజ్ ఇచ్చినా క్షణాల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు ఏ ప్రాంతంలో ఉన్న తెలుగువారికైనా చేరిపోతుంది. రోజు రోజుకూ వీరి అభిమానుల సంఖ్య పెరుగుతూ వస్తోంది..

కడియం నర్సరీలో వీడియో..

నర్సరీలకు గుర్తింపు

కడియం నర్సరీ రంగానికి సంబంధించి వార్తా కథనాలు ఎప్పటికప్పుడు వెలువడుతూనే ఉంటాయి. అయితే ఈ దంపతులు ఈ నర్సరీల్లో ఉండే దేశ విదేశాలకు చెందిన మొక్కల ప్రత్యేకతలను వివరించడంతో మరింత ప్రాచుర్యం పొందాయి. ఏ నర్సరీలో ఎలాంటి ప్రత్యేకత మొక్క వచ్చినా ఈ దంపతులు వాటి వివరాలను క్షుణ్ణంగా ప్రజలకు చేరవేస్తున్నారు. అలంకరణ, పుష్పాలు, ఔషధాలు వంటి మొక్కల వివరాలు చెబుతూ వారు చేస్తున్న వీడియోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

4 వేల వీడియోలు..

ఇప్పటి వరకు ఈ దంపతులు సుమారు 4 వేల వీడియోలను సోషల్ మీడియా ముందు ఉంచారు. నర్సరీ రంగంతో పాటు ఈ ప్రాంతంలో ఉండే ప్రముఖ దేవాలయాలు, మండువా లోగిళ్ల ఇళ్లు, సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన విషయాలు తెలియజేశారు. అలాగే ఆరోగ్య సూత్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్న ఆస్పత్రుల వివరాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసే కొన్ని సౌకర్యాలను లావణ్య-సత్తిబాబు దంపతులు వివరిస్తూ వస్తున్నారు.

లెక్కతేలిన ఎమ్మెల్సీ ఓటర్లు

- అత్యధికం కాకినాడ... అత్యల్పం అల్లూరు జిల్లా
- మొత్తం ఓటర్లు 3,14,984

ఏలూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల లెక్క తేలింది.ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు పోలిం గ్ జరగనున్న విషయం తెల్సిందే. ఓటర్ల చేర్పులకు ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ముగిసిన ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఇవ్వగా, స్వల్పంగా హెచ్చు, తగ్గులు ఆయా జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. ఓవరాల్‌గా లెక్క తేలారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తంగా 456 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3,14,984 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పురుష ఓటర్లు 1,83,347 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,31,618 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 19 మంది ఉన్నారు. ఓటర్లవరంగా కాకినాడ జిల్లాలో అత్యధికంగా 70,542 మంది ఉండగా, అత్యల్పంగా అల్లూరు సీతారామ రాజు జిల్లాలో 4,669 మంది ఓటర్లు ఉండటం గమనార్హం. ఈ సారి ఏలూరు జిల్లాలో వెయ్యి ఓట్ల కంటే ఎక్కువ మంది ఉన్నచోట్ల నాలుగు పోలింగ్ కేంద్రాలకు అదనంగా పెంచారు.

జిల్లాల వారీగా ఓటర్ల తుది జాబితా ఇలా..

వరుసనెం	జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
1	అల్లూరి	12	2,842	1827	0	4669
2	కోనసీమ	95	37,114	27,355	2	64,471
3	తూర్పు	92	36,361	26,606	3	62,970
4	ఏలూరు	66	24,704	17,571	7	42,282
5	కాకినాడ	98	42,463	28,072	5	70,504
6	పశ్చిమ	93	38,863	30,187	2	70,052
	మొత్తం - 456		1,83,347	1,31,618	19	3,14,984

పట్టభద్రులూ ఓటెయ్యడానికి ఈ అర్హతాపత్రాలు చూసుకోండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటు లిస్టులో ఉంటే సరిపోదు. దీనికి సంబంధించి అర్హతా పత్రంను గ్రాడ్యుయేట్ కలిగి ఉండాలి.అవి ఇవే.. ఓటరు ఐడీ కార్డు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, డిగ్రీ అర్హతా సర్టిఫికెట్టు, ప్రవేట్ సంస్థల్లో పనిచేసే వారి హోదాతో జారీ చేసే కార్డులు సరిపోతాయి. బీఎల్‌వోలు ఇంటింటా వచ్చి ఓటరు స్లిప్పులిచ్చి సమాచారం తెలియజేస్తారు. అయితే ఈ స్లిప్‌లు కేవలం ఎంట్రీకి ఉపయోగపడతాయి. ఓటరు తన అర్హతా పత్రాల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్ళాలి. ఇందులో ప్రాధమిక సమాచారం ఖచ్చితత్వంతో ఉండాలి.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

- రిటర్నింగ్ ఆఫీసర్ వెట్రిసెల్వి

ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యానికి అవకాశం కల్పించినట్లు తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల నిమిత్తం విధుల్లో పాల్గొనే సిబ్బంది వారి ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని అన్నారు. దీనికి ఫారం - 12ను జిల్లా రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కేంద్రానికి ఈనెల 20వ తేదీ సాయం త్రం ఐదు గంటల్లోగా సిబ్బంది సమర్పిం చాలన్నారు. సిబ్బంది ఫారం-12ను ఏలూరు. ఏపీ.జీవో.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ ఫారంతో పాటు డ్యూటీ కేటాయింపు చేసిన ఉత్తర్వులు జిరాక్స్‌లు జతపర్చాలని ఆమె కోరారు.

సత్యదేవుడి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.


స్వామివారి దర్శనార్థం ఆలయంలోకి వస్తున్న న్యాయమూర్తి మహేశ్వరి

క్రీడా సంరంభం





వేదికపై మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

- అట్టహాసంగా ప్రారంభమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ
- వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 44 జట్లు
- తొలిరోజు అంబరాన్నంటిన సంబరాలు
- పతకాలతో క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్
- క్రీడా జ్యోతిని వెలిగించి టోర్నీని ప్రారంభించిన కాకినాడ కలెక్టర్
- వెయ్యిమంది క్రీడాకారులతో కిక్కిరిసిన జిల్లా క్రీడా ప్రాంగణం
- కొమ్ము డ్యాన్సులో పాల్గొన్న జిల్లా అధికారి షాన్‌మోహన్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టరేట్(కాకినాడ)/సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో ఆస్ట్రో టర్ఫ్ పిచ్ వేదికగా 2024-25 ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషుల, మహిళల హాకీ టోర్నమెంట్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశంలోని 18 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 44 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నడుమ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనికి ముఖ్యఅతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ విచ్చేయగా కలెక్టర్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి బెలూన్లు ఎగరవేశారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం కల్పించినందుకు సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డుకు ధన్యవాదాలు తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద కాకినాడ జిల్లా క్రీడా మైదానాన్ని జాతీయ స్థాయి టోర్నమెంట్లు నిర్వహించే విధంగా అత్యుత్తమంగా అభివృద్ధి చేశామన్నారు. టోర్నీకి విచ్చేసిన క్రీడాకారులందరికీ స్వాగతం పలుకుతూ క్రీడా స్ఫూర్తితో ఈవెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. క్రీడాకారులు తమ జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలు, బీచ్‌ను సందర్శించాలని సూచించారు. టోర్నమెంట్ నిర్వహణకు స్పాన్సర్ చేసిన కార్పొరేట్, వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మరో ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి పెద్దఎత్తున క్రీడాకారులు విచ్చేసి ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు.

తొలిరోజు విజేతలు

కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్-2025లో మ్యాచ్-1లో హరియాణా జట్టు 14-0 తేడాతో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై గెలుపొందగా మ్యాచ్-2లో పాండిచ్చేరి జట్టు 10-1 తేడాతో కర్ణాటక జట్టుపై విజయం సాధించింది.

అతిథులకు సత్కారం

టోర్నమెంట్‌కు అతిథులుగా విచ్చేసిన అర్జున అవార్డు గ్రహీతలు మహ్మద్ రియాజ్, ముకేష్ కుమార్‌లను కలెక్టర్ సత్కరించారు. ఇటీవల జాతీయ క్రీడల్లో జిమ్నాస్టిక్స్‌లో బంగారుపతకం సాధించిన కాకినాడ జిల్లా క్రీడాకారిణి ఎస్‌కే యాసిన్‌ను, కోచ్ సురేష్‌లను సన్మానించారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్ర స్పాన్సర్ చేసిన రూ.25వేలు చెక్కును యాసిన్‌కు అందజేశారు. అనంతరం స్పాన్సర్లైన కాకినాడ సీపోర్టు లిమిటెడ్, ఓఎన్‌జీసీ, అపోలో ఆసుపత్రి, నెక్కంటి సీఫుడ్స్, పట్టాభి ఇండస్ట్రీస్, లలితా ఇండస్ట్రీస్, శ్రీసత్య స్కాన్, ఆదిత్య యూనివర్సిటీ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, టైకే ఇండస్ట్రీస్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.


కళాకారుడి ప్రదర్శన


పాట పాడుతున్న కళాకారుడు


కర్రసాము ప్రదర్శిస్తున్న కళాకారులు

ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

తొలుత ముఖ్యఅతిథులు, అతిథులు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి జాతీయ జెండాను జేసీ రాహుల్‌మీనా, ఆలిండియా హాకీ టోర్నమెంట్ జెండాను అసిస్టెంట్ కలెక్టర్ భావన, రాష్ట్ర జెండాను డీఆర్వో వెంకట్రావు ఆవిష్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పోటీల అనంతరం క్రీడా మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. చింతూరు గిరిజన కళాకారులు నిర్వహించిన సాంప్రదాయ నృత్యం కొమ్ము డ్యాన్సులో కలెక్టర్, ఎస్పీ పాల్గొని కొమ్మును ధరించారు. వైజాగ్ బల్దేవ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థల విద్యార్థులు నిర్వహించిన కర్ర సాము ఆకట్టుకుంది. కళాంజలి ఆర్కెస్ట్రా నిర్వహించిన రాక్ బ్యాండ్ ఉర్రూతలూగించింది. విశాఖపట్నానికి చెందిన కోచ్ బాల్‌దేవ్ ఆధ్వర్యంలో 23 మంది ప్రదర్శించిన కర్ర సాము అందరినీ ఆకట్టుకుంది.

నిర్వహణకు రూ.2 కోట్లు

రెండు వారాలపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ నిర్వహణకు సుమారు రూ.2 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కొంత ప్రభుత్వం సమకూర్చగా, మిగిలిన నిధులు వివిధ పారిశ్రామికవేత్తలు, అసోసియేషన్లు సమకూర్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతిరోజు దాదాపు వెయ్యిమంది క్రీడాకారులకు టీ, టిఫెన్, భోజనాలు అందించేందుకు జిల్లా క్రీడామైదానంలో అన్ని ఏర్పాట్లు చేశారు.


కొమ్ము ధరించిన ఎస్పీ బిందు మాధవ్

తలపడే జట్లు ఇవే..

రెండు వారాలపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో బీహార్, చండీఘర్, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, రాయ్‌పూర్, ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియేట్, గుజరాత్ సెక్రటేరియట్, ఆర్ఎస్‌బీ అహ్మదాబాద్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, సిమ్లా, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిసా, పాండిచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ నుంచి టీమ్‌లు తలపడనున్నాయి.


హాకీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

అంతర్జాతీయ క్రీడాకారుల రాకతో ప్రేరణ



ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ ఏపీలో తొలిసారిగా ఆతిథ్య ఇవ్వడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ క్రీడాకారుల రాకతో విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి, ప్రేరణ కలిగించినట్టు అవుతుంది. నిత్యం ఉద్యోగాల్లో బిజీగా ఉండే అధికారులు, సిబ్బందికి ఇటువంటి టోర్నీలు మానసిక ఉత్తేజాన్ని ఇస్తాయి. ఆలిండియా స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో ఏజీఎస్, ఇన్‌కంటాక్స్ తదితర శాఖల భాగస్వామ్యంతో హాకీ టోర్నీమెంట్లు జరిగేవి. తొలిసారిగా ఏపీలో జరుగుతోన్న టోర్నీలో ప్రభుత్వ భాగస్వామ్యంగా ఉండడం క్రీడలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. కాకినాడలో 4-5 ఏళ్ల కిందట ఒకసారి మహిళల టోర్నీకి వచ్చాను. కాకినాడ కాజా నచ్చింది.

-ముకేష్ కుమార్, అర్జున అవార్డు గ్రహీత.

క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

క్రీడల పట్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తారు. నాణ్యమైన తరీదునిచ్చే కోచ్‌లను నియమించాలి. టోర్నమెంట్స్ నిర్వహించడం వల్ల నిత్యం విధినిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు మానసిక ఉల్లాసం కలుగుతుంది. నేను 1996, 2000లో వేసవి ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాను. 1998లో భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డును బహూకరించింది. ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడలో నిర్వహించడంతో భవిష్యత్తులో హాకీ పట్ల విద్యార్థులు, యువతకు మరింత మక్కువ కలుగుతుంది. ఇక్కడి క్రీడా మైదానంలో సౌకర్యాలు అంతర్జాతీయ క్రీడా మైదానానికి ధీటుగా ఉన్నాయి.

-మహమ్మద్ రియాజ్, అర్జున అవార్డు గ్రహీత.

హైదరాబాద్ నుంచి వచ్చి పురుగుమందు తాగి..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కపిలేశ్వపురానికి చెందిన ఇనాగలక్ష్మీ దుర్గ(28) తన భర్త ముగ్గురు పిల్లలతో కలిసి తెలంగాణలోని శంషాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అయితే స్త్రీ సంబంధిత ఆరోగ్య సమస్యలవల్ల ఆమె బాధపడుతూ ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ్నానికి పాల్పడింది. రాజమహేంద్రవరంలోని తెలిసిన వ్యక్తి సూచనతో వైద్యానికి ఇక్కడికి వచ్చారు. హైవేలోని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీనిపై ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో
లారీ డ్రైవర్ మృతి

● మృతుడు పంగిడివాసిగా గుర్తింపు


మృతిచెందిన లారీ డ్రైవర్ రామకృష్ణ

మండపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం ద్వారపూడి పంచాయతీపరిధిలో గల వేములపల్లిలో విద్యుదాఘాతానికిగురై లారీ డ్రైవర్ శనివారం అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. మండపేట రూరల్ సీఐ పీతల దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు మండలం పంగిడికి చెందిన చిటికెన రామకృష్ణ(52)లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడు వేములపల్లిలో వున్న బ్రాన్ ఆయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్‌లోడ్‌ను తీసు కువెళ్లేందుకు వచ్చి శనివారం ట్యాంకర్‌ను ఫ్యాక్టరీ బయట ఉంచి శుభ్రం చేసుకునేందుకు లారీపైకి ఎక్కిన డ్రైవర్ రామకృష్ణకు సమీపంలో ఉన్న 33. 11కె.వి. విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురికావటంతో లారీ పైనుంచి కింద పడిపోయి అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మండపేట రూరల్ సీ.ఐ. దొరరాజు, ఎస్ఐ బుజ్జిబాబు లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు చిటికెన శ్రీరామచంద్రుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీ.ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఎక్కుతూ జారిపడి యువకుడి మృతి


వాకాడ జాన్‌బాబు

సామర్లకోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సామర్లకోట నుంచి నూజివీడు వెళ్లేందుకు తన తండ్రి, భార్య కుమారుడితో వెళ్లేందుకు శనివారం రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందికి జారిపడడం, అదే సమయంలో రైలు బయలుదేరడంతో ఆ రైలు కింద పడి తీవ్రగాయాలతో కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీకు చెందిన వాకాడ జాన్‌బాబు (27) అక్కడికక్కడే మృతి చెందాడు. చెంతనే ఉన్న జాన్‌బాబు కుటుంబ సభ్యులు నిశ్చే ష్టులై రోదించారు. సామర్లకోట రైల్వే పోలీ సులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ఆలయం తిరువీధులలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గోవిందనామస్మరణతో మార్మోగిన వాడపల్లి

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.41.92లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల లో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.41.92 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

టార్క్-2025 టెక్నికల్ సింపోజియం

» మార్చి 15, 16 తేదీల్లో జాతీయస్థాయిలో నిర్వహణ

» పోస్టర్‌ను ఆవిష్కరించిన వీసీ మురళీకృష్ణ


టార్క్ టెక్నికల్ సింపోజియం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని సమావేశహాల్లో యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, స్టూడెంట్ చాప్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 15, 16 తేదీల్లో నిర్వహించనున్న టార్క్-2025 టెక్నికల్ సింపోజియం పోస్టర్‌ను వర్సిటీ ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ శనివారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ సింపోజియంలో బాగంగా బ్రిడ్జ్ బిల్డింగ్, లేత్ మాస్టర్, వర్క్‌షాప్స్, రోబోరేస్, డిజైన్ బ్రేక్, చెస్ మోనార్క్, మెకానికల్ క్విజ్, మెక్ ఓమేనియా, స్లైడ్‌ప్లేయిన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, కాస్టింగ్ క్రౌన్, ఇంజన్ మాంటేజ్ వివిధ పోటీలు నిర్వహించనున్నారన్నారు. అంతేకాకుండా దీని ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, టీమ్‌వర్క్, సాంకేతిక అంశాలపై పట్టు సాధించడం, ప్రజంటేషన్ స్కిల్స్ పెంపొందుతాయన్నారు. అనంతరం సింపోజియం కన్వీనర్ డాక్టర్ డి.లింగరాజు మాట్లాడుతూ వర్సిటీ, అనుబంధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈఫెస్ట్‌లో పాల్గొని నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, వినూత్న ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


భీమేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు చర్చిస్తున్న అధికారులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను శనివారం దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమి షనర్, ఉపకమిషనర్, జిల్లా దేవదాయశాఖ అధికారితో కలసి పరిశీలించారు. ఆలయంలో ముందు గా దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషన ర్ కె.సుబ్బారావు, ఉపకమీషనర్, శివరాత్రి ఉత్సవ అధికారి డి.ఎల్.వి.రమేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లు క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తుల దర్శనానికి క్యూలైన్లు, బారీకేడ్లు ఏర్పాటు, సప్తగోదావరిలో పుణ్యస్నానాలు, అభిషేకాలు నిర్వహణ ఇతర భద్రతా ఏర్పాట్లుపై చర్చించి ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీకి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉపకార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాదగయలో హుండీల ఆదాయం లెక్కింపు

● రూ.11.61లక్షల ఆదాయం

పిఠాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో హుండీలను శనివారం తెరిచారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్ల సన్నిధిలో ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ. 11,61,650 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్ర కుమార్, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, బ్యాంకు, ఆలయ సిబ్బం ది పాల్గొన్నారు.


పిఠాపురం పాదగయ క్షేత్రంలో హుండీలలోని ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

వైద్యుల పనితీరుపై నిఘా

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిశోర్


కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిశోర్

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించడానికి వైద్యుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ టి.రమేష్‌కిశోర్ అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి, డీహెచ్ఎస్ కార్యాలయాన్ని శనివారం తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ఇటీవల ప్రజల్లో సదరం సర్టిఫికెట్లు తొలగిస్తున్నామని అపోహలు ఉన్నాయన్నారు. దీనివల్ల అర్హులకు ఇబ్బంది ఉండదన్నారు. ఫేక్ సర్టిఫికెట్లు పెట్టిన వారిని ఏరివేస్తామన్నారు. మరో వారంలో సర్వే పూర్తవుతుందన్నారు. తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా డాక్టర్ల పనితీరును పరిశీలిస్తామన్నారు. రాత్రి డ్యూటీల్లో డాక్టర్లపై ప్రత్యేకనిఘా పెట్టామన్నారు. దీనిలోభాగంగా గతనెల రోజుల్లో 50 మంది వైద్యులకు పనితీరు మార్చుకోవాలని షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఫిబ్రవరి మొదటివారం నుంచి ఓపీ కౌంటర్లు, ఆపరేషన్ థియేటర్లు, పేషెంట్లు ఉండే వార్డుల్లో క్యూఆర్ కోడ్ పెట్టామన్నారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే 6 ప్రశ్నలు వస్తాయి. వీటి ద్వారా ఆసుపత్రిలో వైద్యుల పనితీరు, మందుల కొరత, లాబ్ టెస్టులు, నర్సుల ప్రవర్తన తదితర వివరాలు రోగుల నుంచి తెలుసుకుంటామన్నారు.స్పెషలిస్టు డాక్టర్ల రిక్రూట్‌మెంట్ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 297 డాక్టర్ పోస్టులకు 2600 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో ఆలస్యమైందన్నారు. మార్చి నెలాఖరు నాటికి స్పెషలిస్టు డాక్టర్ల భర్తీ జరుగుతుందన్నారు. పదోన్నతులు ఇస్తామన్నారు. ప్రతిరోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు సంబంధించిన ఆబా ఐడి క్రియేట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతి పేషెంటుకు రూ.20లు ఆసుపత్రి ఖాతాకు జమ చేస్తుందన్నారు. గత రెండు నెలలుగా పేషెంటు ఈహెచ్ఆర్‌లు స్కాన్ చేసి ఆబా ఐడి క్రియేట్ చేయడంలో తుని ఆసుపత్రికి సుమారు రూ.2లక్షల వరకు సొమ్ము జమైందన్నారు. ఆబా ఐడి క్రియేట్ చేయడానికి స్థానికంగా ఇద్దరు వ్యక్తులను రూ.8 వేలు గౌరవ వేతనం ఇచ్చి ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఇలా వచ్చిన సొమ్ముతో ఆసుపత్రికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. 26 జిల్లాల డీసీహెచ్ఎస్‌లకు ఫైర్ వాహనాలు తీసుకోవడానికి అనుమతులిచ్చామన్నారు. పారిశుధ్యం, సెక్యూరిటీలకు సంబంధించి సమస్య పరిష్కారానికి న్యూ టెండర్లకు వెళ్లామన్నారు. అత్యవసర మందుల కొరత ఉంటే గుర్తించి ఆరోగ్యశ్రీ నిధులు, హెచ్‌డీఎస్‌లో నిధులు ఉపయోగించి ఆసుపత్రి సూపరింటెండెంట్లు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్.పద్మశ్రీరాణి, ఏడీ టి.విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం కొండ జాతర ఏర్పాట్ల పరిశీలన



మోతుగూడెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిం తూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామంలో సీలేరు నది ఒడ్డున ఒడిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన్ బయర్, చింతూరు తహసీల్దార్ చిరంజీవి సందర్శించారు. అనంతరం ఒడిశా మన్యం కొండ జాతర కమిటీ సభ్యులతో చర్చించారు. అవతల ఒడ్డు నుంచి ఇవ తల ఒడ్డుకు నీటిలో పడవపై ప్రయాణించే భక్తుల కు తగు జాగ్రత్తలు, జలపాతంవద్ద జాతర జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ భారీ కేడ్‌లు ఏర్పాటుచేయాలని పార్కింగ్ స్థలం కూడా దూరం గా ఉండాలని ఇరురాష్ట్రాల అధికారులకు సూచించా రు. పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్‌కి సూచించారు. అక్కడి నుంచి ఇరురాష్ట్రాల అధికారులు సీలేరు నదిపై ఏర్పాటుచేసే ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాట్లు చేసే ప్రదేశాన్ని స్వయంగా బోటుపై వెళ్లి పరిశీలించారు. అక్కడి సమస్యలు గురించి లక్కవరం ఫారెస్ట్ రేంజర్ నానాజీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి, చింతూరు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరునదిలో ఫ్లోటింగ్ బ్రిడ్జిప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇరు రాష్ట్రాల అధికారులు

కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన ఏడుగురిపై కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలకు పాల్పడి పారిపోతూ కానిస్టేబుల్‌ను స్కార్పియోతో ఢీకొట్టి గాయపర్చిన ఏడుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. యర్రవరం గ్రామంలో దొంగతనం చేసి స్కార్పియో వాహనంలో విజయవాడవైపు పారిపోతున్నారని సమాచారం రావడంతో పోలీసులు కొవ్వూరు గా మన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో ఎన్‌హెచ్ 16 వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి.రాంబాబు, హెచ్‌సీ ఎం.లక్ష్మీనారాయణలకు సమాచారం అందించారు. దీంతో టోల్ గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించగా ఢీకొట్టడంతో రాంబాబు కింద పడిపోయాడు. గాయాలు కావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

ట్రాఫిక్ డీఎస్పీపై చర్యలు

● చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్‌కి ఉత్తర్వులు


డీఎస్పీ మేడిశెట్టి వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ డీఎస్పీ మేడిశెట్టి వెంకటేశ్వర్లుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం వచ్చిన నాటి నుంచీ ఆరోపణలు మూటగట్టుకున్న ఆయనకు జిల్లానుంచి ఉద్వాసన పలికారు. గతేడాది డిసెంబరు 24న దేవీచౌక్‌లోని స్వాతీ టీస్టాల్‌లో పని చేస్తున్న యువకుడిని ఆయన కొట్టుకుంటూ జీపులో ఎక్కించుకెళ్లారు. దీనికి సంబంధించిన సీసీ కెమెరా పుటేజీలు ఇటీవల బయటికి వచ్చాయి. సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వ్యక్తిపై పోలీసు దాష్టీకాన్ని జనం ఖండించారు. ఈ విషయం ఎస్పీ నరసింహకిషోర్ దృష్టికి చేరింది. అమానవీయ ప్రవర్తనపై ఉక్కుపాదం మోపే ఎస్పీ.. సదరు డీఎస్పీపై అంతర్గత విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దీంతో ఆయనను తక్షణమే ఇక్కడి విధుల నుంచి తప్పిస్తూ డీజీపీ కార్యాలయంలోని ఏడీజీపీ(శాంతి భద్రతలు) వద్ద రిపోర్టు చేయాల్సిందిగా రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనను వెంటనే రిలీవ్ చేయాల్సిందిగా ఎస్పీని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. కాగా.. కొద్దిరోజుల క్రితం డీఎస్పీ వెంకటేశ్వర్లు గుణదల ఉత్సవాలకు బందోబస్తుకు వెళ్లారు. ఆయనపై చర్యలు తప్పవనే ఉద్దేశంతో అక్కడి విధుల అనంతరం విజయవాడలో బందోబస్తుకు పంపించేశారని అంటున్నారు. గతంలో ఆ డీఎస్పీ ఓ మహిళా కానిస్టేబుల్‌ని లైంగికంగా వేధించడంపై అప్పట్లోనే ఎస్పీ సీరియస్ అయ్యారు. ఆ ఘటనలో ఇంకెప్పుడూ ఆమె జోలికి వెళ్లనంటూ డీఎస్పీ వెంకటేశ్వర్లు స్వాంపు పేపర్‌పై రాసిచ్చారు. ఇది పోలీసు అధికారులకు తప్పుడు మెస్సేజ్ పంపిస్తుందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లోనే ఆ డీఎస్పీపై సస్పెన్షన్ వేటు పడాల్సి ఉండగా 'మేనేజ్' చేసుకున్నారనే విమర్శలు వినిపించాయి. అప్పటి నుంచీ ఆయనను స్థానిక విధులకు దూరం పెడుతూ వచ్చారు. తర్వాత తన వద్ద పనిచేసే హోంగార్డును ఇష్టాను సారం తిట్టడంతో అతడు ఆత్మహత్య చేసుకుంటా నంటూ ఆవేదన చెందారు. ఇలా తరచూ డీఎస్పీపై ఆరోపణ లు వస్తుండడంతో కీలకమైన విధులకు దూరంగా ఉంచారు. అయితే, ఓ సాధారణ యువకుడిని పబ్లిక్‌లో కొట్టుకుంటూ తీసుకెళ్లడంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఆయన సిఫారసుతో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిం చారు. కాగా నాణేనికి మరోవైపు ఇంకొక విధంగా గుసగుసలు వినవస్తున్నాయి. రాజమహేంద్రవరం డీఎస్పీగా రావడానికి అంబికా ప్రసాద్ ప్రయత్ని స్తున్నారని, ఆయన సొంత బంధువైన ఓ హెడ్ కానిస్టేబుల్‌తో డీఎస్పీ వెంకటేశ్వర్లు సీసీ కెమెరా పుటేజీ తీయించి సోషల్ మీడియాలో వైరల్ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అంబికా ప్రసాద్ వైసీపీ వీర విధేయుడిగా పేరుబడడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆయన వీఆర్‌లోనే ఉన్నారు. ఈ అంత ర్గత రాజకీయాలవల్ల ప్రజలకు రక్షణ కల్పించాల్సిన విధుల్లో ఉండి యూనిఫాం పరువు బజారుకు ఈడుస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు.

తాకట్టు బంగారం తారుమారు

● రూ. కోటి విలువైన బంగారం మాయం ● క్యూ కడుతున్న ఖాతాదారులు

తునిరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తేటగుంటలో గుర్తింపు పొందిన కెనరా బ్యాంక్ కుదవపెట్టిన బంగారానికి భద్రత లేకుండాపోయింది. ఇంటి దొంగల పనితో కోటి విలువైన బంగారు ఆభరణాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. బంగారంపై అప్పులకు సంబంధించి అదే బ్యాంకులో 3500 ఖాతాలు ఉండగా వీటిలో 150కి పైబడి ఖాతాల్లో కోటి విలువగల కొన్ని ఆభరణాలు కానరాకుండా పోవడంపై ఖాతాదారులు ఆందోళనకు దిగుతున్నారు. ఇప్పటికే ఆశాఖ ఉన్నతాధికారులు బ్యాంకులో విచారణ చేపట్టి అవకతవకలకు బాధ్యులుగా ఉన్న బ్యాంక్ మేనేజర్‌తోపాటుగా మరో ఇద్దరు బ్యాంకు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు ప్రస్తుత ఇన్‌చార్జ్ బ్రాంచ్ మేనేజర్ తెలుపుతున్నారు. బ్యాంక్ ఖాతాదారులు ఎవరూ ఆందోళన చెందనవసరంలేదని, తమ నగలకు పూర్తి భరోసా ఇస్తామని హామీ ఇస్తూ రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్లు ఖాతాదారులు తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో మ్యారేజ్ సర్టిఫికెట్


పాతయింజరం సచివాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న సిబ్బంది

ఐ.పోలవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను అములులోకి తెచ్చింది. దీంతో లబ్ధిదారులు ఇంటి వద్ద నుంచే సేవలు పొందే అవకాశం లభించింది. వివరాలను తమ మొబైల్ వాట్సాప్ ద్వారా సంబంధిత కార్యాలయానికి మెస్సేజ్ చేరవేస్తారు. అక్కడి సిబ్బంది పరిశీలించి అదేరోజు లబ్ధిదారుడి మొబైల్‌కు మెస్సేజ్ పెడతారు. తాజాగా పాతయింజరం సచివాలయంలో ఈవిధానంలో మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేశారు. నూతన జంట ఎం.దుర్గాదేవి, ఆర్.దుర్గారావు వాట్సాప్ గవర్నస్ ద్వారా సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి పోతుల సూర్య అదేరోజు వారికి మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ విధానం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్‌లో పులవర్తి శోభ(72) తన భర్త పాలేశ్వరరావుతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇంటి ఆవరణలోని ఎండుటాకులు, చెత్తా చెదారాన్ని ఆమె తరచుగా పోగేసి అగ్గి పెడతారు. ఈ క్రమంలో శనివారం మంట వేసి ప్రమాదవశాత్తూ ఆ మంటలో పడి కాలిన గాయాలుకావడంతో ఆస్పత్రికి తరలించారని.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



కొవ్వూరు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో 55నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. అతని ఒంటిపై లైట్ నీలంరంగు చొక్కా, నలుపురంగు షార్ట్ ధరించి, కుడిచేతి వేలుకి ఏసు ప్రభువ బొమ్మ ఉంగరం ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. మృతుడికి సంబంధించి ఆచూకీ తెలిసిన వారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్ 9440796622, 08813- 231100, 9154875583కు సమాచారం తెలపాలన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

కరప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బంధువుల వివాహ కార్యక్రమానికి వచ్చిన ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయనగరంజిల్లా డెంకాడ మండలం పెదతాడివాడ గ్రా మానికి చెందిన వెలమల నాగమణి శుక్రవారం రాత్రి కాకినాడజిల్లా కరప మండలం నడకుదురు వెలమ సంక్షేమ సంఘ భవనంలో జరుగుతున్న బంధువు బొంగు నాగభూషణరావు వివాహానికి హాజరయ్యారు. విందు అనంతరం రాత్రి 11గంటల సమయంలో పెండ్లికుమారుడు ఇంటికి వెళ్లడానికి తల్లితోకలిసి రోడ్డు దాటుతున్నారు. ముఖానికి మాస్క్ ధరించిన ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని 50 గ్రాముల స్టెప్‌చైన్‌ను లాక్కుని వేగంగా వెళ్లిపోయాడు. స్థానికులు, బంధువులు వెంబడించినా చైన్ స్నాచర్ తప్పించుకుని పారిపోయాడు. దీనిపై బాధితురాలు కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రావులపాలెం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలో జరిగింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరుజిల్లా కొయ్యలగూడెం సమీపంలోని డిప్పకాయలపాడుకు చెందిన మద్దూరి శివన్నారాయణ శనివారం మధ్యాహ్నం లక్ష్మీపోలవరంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి సమీపంలోని అరటితోటల్లోకి వెళ్లి ఒంటిపై పెట్రోల్‌పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు 108లో శివన్నారాయణను ముందు కొత్తపేట, అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల గొడవల కారణంగా ఇలాచేసి ఉండవచ్చునని బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ
అంబాజీపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇరుసుమండ శివాలయం ప్రాంగణంలో ఉన్న గణపతి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, పీఠార్చన, మహాపూర్ణాహుతి, గోదృష్టి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

రేపు మంత్రి కుమార్ యానాం రాక
యానాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర ఆదిద్రావిడ శాఖ మంత్రి ఏకే సాయిశరవణన్ కుమార్ ఈనెల 17వ తేదీన యానాం రానున్నారు. సోమవారం ఉదయం 9గంటలకు పుదుచ్చేరి నుంచి రోడ్డుమార్గన బయలుదేరి సాయంత్రం 5 గంటలకు యానాం చేరుకుంటారని ఆ శాఖ ఓఎస్డీ వి.కలిపెరుమాళ్ ప్రకటనలో తెలిపారు.

శిథిలావస్థలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ భవనం

- దశాబ్దాల కాలంగా ఖాళీగా వదిలేసిన అధికారులు
- ఆక్రమణకు గురవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ స్థలం

అంబాజీపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం నిర్మించిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ భవనం రెండుదశాబ్దాలుగా శిథిలావస్థలో ఉంది. అంబాజీపేట మండలం మాచవరం గ్రామంలో పశువుల సంతమార్కెట్ వద్ద 20ఏళ్ల క్రితం ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈషాపింగ్ కాంప్లెక్స్‌లో 8షాపులను ఏర్పాటుచేసి ఎస్సీ యువకులకు ఉపాధి కోసం అద్దెకు ఇచ్చారు. అయితే కొన్ని సంవత్సరాల పాటు ఈభవనంలో అద్దె తీసుకున్న యువకులు షాపులు నిర్వహించారు. షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దెకు తీసుకున్న యువకులు షాపులను ఖాళీ చేసేశారు. అప్పటి నుంచి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని దళిత నాయకులు అధికారులు విన్నవించినప్పటికి పట్టించుకోవడంలేదు. జిల్లా పరిషత్, ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మాచవరం పంచాయతీ పాలకవర్గంతో పాటు దళిత నాయకులు జిల్లా పరిషత్ సీఈవో, ఎస్సీ కార్పొరేషన్ ఈడీలకు లేఖలు అందించారు. అయినప్పటికి ఈషాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నోచుకోవడంలేదు. శిథిలావస్థలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద చెత్తాచెదారం వడేస్తున్నారు. అలాగే ఈషాపింగ్ కాంప్లెక్స్‌పై పెద్ద పెద్ద మొక్కలు మొలిచాయి. ఆ ప్రాంతంలో ఉన్న స్థలం ఆక్రమణకు గురవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ భవనానికి నిధులు మంజూరుచేసి నిరుద్యోగ ఎస్సీ యువకులకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.


అంబాజీపేటలో శిథిలమైన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ భవనం

స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర మరింత పురోగతి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర మరింత పురోగతి సాధిస్తుందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో గడియారం స్తంభం సెంటర్లో నిర్వహించారు. తొలుత సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్రం చేశారు.అనంతరం చీపుర్లు పట్టి వీధులు ఊడ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ ట్రెజరర్ వడాల నాయుడు, ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గోకరకొండ నాగేంద్ర, పట్నాల రమణ, నూకల సత్యనారాయణ, ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, డా. వైవీ నరసింహారావు, గోపాలకృష్ణ, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కేదారశెట్టి వెంకటేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అమలాపురం ప్రాంతీయఆస్పత్రిలో సూపరింటెండెంట్ డా.కె.శంకరరావు, వైద్యులు, సిబ్బంది పశుసంవర్థక శాఖ కార్యాలయం వద్ద సహాయ సంచాలకుడు డా.ఎల్.విజయారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు.


అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో చీపుర్లు పట్టి వీధులు ఊడుస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ
అమలాపురం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కామనగరువు పంచాయతీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఉండ్రు బాబ్జీరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలు వార్డుల్లో పర్యటించి తడి చెత్త, పొడిచెత్త సేకరణ గురించి వివరించారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో స్వచ్ఛాంధ్రపై ప్రజలతో కలిసి అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఈవో పీఆర్డీ బి.మంగాదేవి, కార్యదర్శి రుద్రరాజు, ఎస్ఎస్ సూరపురాజు, పర్వంశెట్టి ఆదినారాయణ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం
అంబాజీపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో జీవీ సరోవరరావు అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పేర్రాయిపాలెంలో పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇతర ప్రాంతాల నుంచి బండారులంక సమీపంలోని పేర్రాయిపాలెం వద్ద చెత్తను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఏవో ఏపీఎల్ నరసింహ, ఏపీవో అడపా వెంకటకృష్ణ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, సీనియర్ అసిస్టెంట్ గిరి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
ముమ్మిడివరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని ముమ్మివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ నిర్వహించి రోడ్డు పరిశుభ్రత చేపట్టారు. సాంఘిక సంక్షేమ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ పివి.నూకరాజు, హెల్త్ అసిస్టెంట్ ఎఎస్ఎన్.రాజు, ఏఈ సుధాకర్, టీపీవో రాజేష్‌బాబు, నగర పంచాయతీ సిబ్బంది, సెనటరీ సెక్రటరీలు పిఎంఎం.భాస్కరరావు, పివో కోఆర్డినేటర్ రాజేశ్వరి, మెప్మా ఆర్పీలు, స్వయసహాక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


ముమ్మిడివరం: ఉద్యోగులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రవివర్మ

స్వచ్ఛ ఆంధ్రకు కృషి చేయాలి
మామిడికుదురు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, సమగ్ర శిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. శనివారం మామిడికుదురులో ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగస్వాములమౌతామంటూ ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.వెంకన్నబాబు, ప్రధానోపాధ్యాయిణి సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతివృత్తుల సేవా సంఘాన్ని బలోపేతం చేస్తా

జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బరాజు


సుబ్బరాజును అభినందిస్తున్న సభ్యులు

అమలాపురంటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లా శాఖ కార్యాలయంలో శనివారం జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘానికి గౌరవాధ్యక్షుడిగా దాట్ల వెంకట సుబ్బరాజును ఏకగ్రీవంగా నియమించారు. ఈసందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘాన్ని జిల్లాలో బలోపేతం చేస్తానని, విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పూర్తి సహకారం అందిస్తానని, చేతివృత్తుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని చెప్పారు. సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గున్నేపల్లి భీమశంకరం, కె.నరసింహరాజు, పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, జనిపల్లి వీరరాఘవులు, గెద్దాడ వెంకటరమణ, తొత్తరమూడి దొరబాబు, ముషిని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు విజయవంతం
రాజోలు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చే నేపథ్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు విజయవంతమయ్యాయని ఎంఈవో నల్లి మనోహరం అన్నారు. ఈ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రైమరీ, ఉన్నత తరగతులకు వేర్వేరుగా ఒకే రోజు నిర్వహించడం జరుగుతుందన్నారు. శనివారం జరిగిన సమావేశంలో పరిశీలకుడుగా సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్లు, టెక్నికల్ సిబ్బంది, ఐఎఫ్పీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. ఈశిక్షణా కార్యక్రమంలో హెచ్ఎంలు ఎస్ఎస్ఎస్ శర్మ, కె.సరస్వతి, ఎ.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం
అల్లవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చని డీపీవో శాంతాలక్ష్మి అన్నారు. శనివారం కొమరగిరిపట్నంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బట్టువానిచెరువు వద్ద వర్మీకంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. కొమరగిరిపట్నం, అల్లవరం, బోడసకుర్రు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రతిజ్ఞలు, అవగాహన సదస్సులు జరిగాయి. కార్యక్రమంలో డీఎల్పీవో బొజ్జిరాజు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, ఏపీవో వి.శ్రీనుబాబు, చిక్కం శ్రీనివాస్, ఎస్.రాజమోహన్, ఎస్.దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

బెల్టుషాపుల్లో జోరుగా మద్యం అమ్మకాలు

అల్లవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ధరల కిక్‌తో బెల్టు షాపుల ద్వారా జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గుడి, బడి, నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నా ఎక్సైజ్ పోలీసు శాఖల దాడులు లేవని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి. రామేశ్వరం, రెబ్బనపల్లి, ఓడలరేవు తదితర తీర గ్రామాల్లో మద్యం బెల్టు షాపులకు లక్షల రూపాయల్లో వేలం పాటలు నిర్వహించినా ఎవరూ పట్టించుకోక ఆయా గ్రామాల్లో యానాం నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. క్వార్టర్ సీసాకు రూ.50 నుంచి రూ.70 అదనంగా వేసి ఓపెన్ ఎయిర్ బార్ షాపుల్లా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దేవగుప్తం, ఓడలరేవు, గుడ్డివానిచింత, అల్లవరం, డి.రావులపాలెం, ఎస్.పల్లిపాలెం, రెబ్బనవల్లి గ్రామాల్లో మద్యం అమ్మకాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. బెండమూర్లంక, కొమరగిరిపట్నం, అల్లవరం మద్యం లైసెన్సు షాపుల వద్ద రోడ్లపై వాహనాలు పెట్టడంతో ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మద్యం బెల్టు షాపులను అరికట్టాలని ప్రభుత్వ ఉన్నతాధికారులకు మహిళా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. విచ్చలవిడిగా మద్యం అమ్మకాల వల్లే అల్లవరం మండలంలో దొంగతనాలు పెరిగిపోయాయని ఆందోళన చెందుతున్నారు.


ఓడలరేవులో బెల్టుషాపు

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం
యానాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): యానాంలో సీబీఎస్‌సీ పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈసంవత్సరం నుంచి యానాం ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌సీ విద్యా బోధన ప్రారంభమైయింది. దీంతో యానాంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 285 మంది విద్యార్థులకు యానాం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు ఇద్దరు మినహా 283 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్లు ఎస్.విజయ్‌కుమార్, డి.ప్రసాద్ సూచించారు. శనివారం మాకానపాలెం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ మహిళా కూలీలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకుల్లో ఖాతా ఉన్న ప్రతీ ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి లావాదేవిలు నిర్వహించుకోవాలని, అలా చేయకపోతే ఖాతా పనిచేయదన్నారు. బ్యాంకుల ద్వారా అమలవుతున్న ప్రధాన మంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా బ్యాంకుల ద్వారా జరిగే వివిధ కార్యకలాపాల గురించి వివరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

అమలాపురంటౌన్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అభ్యర్థించారు. శనివారం అమలాపురం పట్టణ పరిధిలోని ఎస్‌కెబీఆర్ కాలేజీ, శ్రీవేంకటేశ్వర డిగ్రీకాలేజీ, ఆదిత్యా జూనియర్ కాలేజీలలో పనిచేస్తోన్న అధ్యాపకులు, ఉద్యోగులను కలిసి ఎమ్మెల్యే ఆనందరావు ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అమలాపురం పట్టణ టీడీపీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, నాయకులు దిన్నాబాబు, కంచిపల్లి రాము, మాచిరాజు వెంకటరమణ, జనసేన నాయకులు కంచిపల్లి అబ్బులు, మాజీ కౌన్సిలర్ దేవరపల్లి శాంతికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అమలాపురం: ఆదిత్య కళాశాల అధ్యాపకులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు
కాట్రేనికోన: చెయ్యేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

కూటమి అభ్యర్థిని గెలిపించండి
కాట్రేనికోన, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శనివారం చెయ్యేరు హైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యతా ఓటును రాజశేఖరానికి వేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి అశోక్, త్సవటపల్లి నాగు, వెంట్రు సుధీర్, చెల్లి సురేష్, సలాది నానాజీ, గిడ్డి చంటిబాబు, గుత్తుల బుజ్జి, గుత్తుల సూర్యమహాలక్ష్మి, ఉచ్చుల నారాయణ, కాశి జ్యోతిబాబు, కొంకి శ్రీను, భీమవరపు శ్రీనివాస్, కడలి వెంకట సత్యనారాయణ, మోర్త శ్రీనివాసవర్మ, కొప్పూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. కందికుప్ప హైస్కూల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలంటూ కూటమి నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, వెంట్రు సుధీర్, ఆకాశం శ్రీనివాస్, గెడ్డం అరుణ్‌కుమార్, చెల్లి సురేష్, సోమన్న, జయరత్నంపాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కి మొదటి పాధాన్యతా ఓటేసి గెలిపించాలని తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు పట్టభద్రులను అభ్యర్థించారు. శనివారం అనాతరంలో టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికి తిరిగి పట్టభద్రుల ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కురసాల శివబాబు, సర్పంచ్ పి.చిరంజీవి, గొలకోటి రంజాన్, పేరిచర్ల సురేష్‌రాజు, వలవల శ్రీను, మునుకొటి ఏసుబాబునాయుడు, పెయ్యల వెంకటరమణ, బొక్కా సురేష్, జామిశెట్టి శ్రీను, రామదాసు నాగబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలంటూ కూటమి నాయకులు శనివారం అల్లవరంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీరామ్, కంకిపాటి వీరబాబు, కంకిపాటి గోపి, కడలి దేవీప్రసాద్, చికిలే చిట్టిబాబు, నాగాబత్తుల ఆకాష్, టీడీపీ నాయకుడు పచ్చిమాల ఏడుకొండలు, బీజేపీ నాయకుడు సుంకర సాయిబాబు పాల్గొన్నారు.

'దిశ'పై ఎంపీ సమీక్ష


రోగులతో మాట్లాడుతున్న ఎంపీ వైద్యలింగం బృందం

యానాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): యానాం పరిపాలనాధికారి కార్యాలయంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ కమిటీ (దిశ)పై సమీక్ష సమావేశం నిర్వహించారు. పరిపాలనాధికారి మునిస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి లోక్‌సభ సభ్యుడు వి.వైద్యలింగం, పుదుచ్చేరి కాంగ్రెస్ ఎమ్మెల్యే వైద్యనాథన్ హాజరయ్యారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో యానాంలో అమలవుతోన్న పలు శాఖలకు సంబంధించి సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. అయుష్మాన్ భారత్, వ్యవసాయ, మత్స్య శాఖలకు సంబంధించి సబ్సిడీలు, ప్రజాపనులశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనులు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించి వాటి పని తీరును పరిశీలించారు. సమావేశంలో ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ప్రతినిధులు హాజరయ్యారు. అయితే సమావేశంలో కనకాలపేట లోని డంపింగ్‌యార్డు సమస్యను మూడు నెలల్లో పరిష్కరించకపోతే ఆ చెత్తను ఆర్ఏ, మున్సిపాల్ కార్యాలయాలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఇంటి ముందు ప్రజలు వేస్తారని ఎంపీ వైద్యలింగం పేర్కొన్నారు. అలాగే యానాం జిప్మెర్ అసుపత్రిని ఎంపీ వైద్యలింగం సందర్శించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా యానాం వచ్చిన ఎంపీ బృందం శనివారం ఉదయం ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో చర్చించారు. ఆయన వెంట యానాం కాంగ్రెస్ నాయకులు దినేష్, కాటంశెట్టి రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

నామన ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు
మామిడికుదురు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నామన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు తెలిపారు. రాంబాబు సతీమణి కృష్ణవేణి మొదటి వర్ధంతి పురస్కరించుకుని 100మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బొల్లిశెట్టి జయరాం, సొసైటీ మాజీ అధ్యక్షుడు బొలిశెట్టి ప్రభుదాస్, కుంపట్ల బాబ్జి, సరెళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

గడ్డర్ తొలగించి వాహనాల మళ్లింపు
కాట్రేనికోన, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఏటిగట్టుపై వాహనాలు వెళ్లకుండా హెడ్‌వర్క్స్ అధికారులు ఏర్పాటు చేసిన గడ్డర్లను వాహదారులు రాత్రి వేళల్లో తొలగిస్తున్నారు. గురువారం తొలగించిన గడ్డర్లను అధికారులు తిరిగి ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి వాహనదారులు గడ్డర్‌ను తొలగించి తమ పని కానిచ్చుకున్నారు. కొంతమంది ఈ దృశ్యాన్ని వీడియో తీశారు. భారీ వాహనాలు తిరగడం వల్ల ఏటిగట్టు కుంగిపోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలకు లోబడి విక్రయాలు సాగించాలి
ముమ్మిడివరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కోడిమాంసం విక్రయం దుకాణం దారులు, రెస్టారెంట్ యాజమాన్యులు నిబంధనలకు లోబడి కోడి మాంసం, కోడి గుడ్లు అమ్మకాలు సాగించాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. శనివారం కమిషనర్‌ను ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కలిశారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి తగ్గే వరకు నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మేనేజర్ పివి.నూకరాజు, హెల్త్ అసిస్టెంట్ ఎఎస్ఎన్ రాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, కోడి మాంసం దుకాణాల యాజమాన్యులు, రెస్టారెంట్ యాజమాన్యులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌గా ప్రతిపాదిస్తున్నాం
అమలాపురంటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి ప్రాథమిక పాఠశాలను మోడల్‌స్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డా.షేక్ సలీంబాషా తెలిపారు. శనివారం పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. తరగతుల వారీగా విద్యార్థుల స్థాయిని తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు అడిగారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెచ్ఎం జె.పద్మావతి, పంచాయతీ కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు, డి.నాగబాబు, రెహమాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
అంతర్వేది, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి, అంతర్వేది, గుడిమూల, మోరి గ్రామాల్లో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం మాజీ మంత్రి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పీతల సుజాత ప్రచారం నిర్వహించారు. రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అలాగే మల్కిపురం మండలం పడమటపాలెం, కేశనపల్లి గ్రామాల్లో కూటమి శ్రేణులతో కలిసి ఆమె పర్యటన సాగించారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, బీజేపీ నాయకులు అడబాల సత్యనారాయణ, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మంగెన భూదేవి, తాడి మోహన్, గిడ్డి సత్యనారాయణ, బందెల పద్మ, రుద్రరాజు వెంకటరామరాజు, చిటికెన రామ్మోహనరావు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


పేరాబత్తులను గెలిపించండి
రాజోలు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఉపాధ్యాయులను కోరారు. శనివారం ఆయన రాజోలు హైస్కూల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకురాలు, మాజీ మంత్రి పీతల సుజాత, గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, సూరిశెట్టి శ్రీనివాస్, బోళ్ళ సతీష్‌బాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, మంగెన భూదేవి, బందెల పద్మ, మంగెన నాని, పినిశెట్టి బుజ్జి, కడలి వెంకటరమణారావు, అడబాల విజయ్, కోళ్ళ బాబీ పాల్గొన్నారు.

దాసరి కిరణ్‌కుమార్‌కు ఘనస్వాగతం
అంతర్వేది, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిరిశాల బాలాజీ విచ్చేశారు. ఆయనకు నియోజకవర్గ జనసేన నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనం చేయించి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బాలాజీ అందించారు. ఆకన బాబ్జినాయుడు, బైరా నాగరాజు, పొన్నాల ప్రభ, ఏసు, సాయి, గంటా నాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి
మామిడికుదురు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనకు ముందుకు సాగాలని సమగ్రశిక్ష సీఎంవో వీవీవీ సుబ్రహ్మణ్యం కోరారు. మామిడికుదురు హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావడంతో వారిని సీఎంవో శనివారం అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకన్నబాబు, ప్రధానోపాధ్యాయిని నిరంజని పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలి
యానాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి ఎన్.రంగసామి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం నాలుగేళ్లలో పది మందికి కూడా ఉద్యోగాలు ఇవ్వలేదని, అభివృద్ధి జరగలేదని పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సీఎంలు నారాయణసామి, వైద్యలింగం చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలని ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ యానాం శాఖ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనాలుగేళ్లలో ఎల్‌డీసీ, యూడీసీ, పోలీస్, ఫైర్, ప్రజాపనుల శాఖ, సహకార శాఖ, ఆరోగ్య తదితర శాఖల్లో రెండు వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేస్తే 10మందికి కూడా ఉద్యోగాలు ఇవ్వలేదని పచ్చి అబద్ధాలు చెప్పడం చూస్తుంటే వారి మానసిక పరిస్థితిపై సందేహం వస్తుందన్నారు. 2016లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చమురు సంస్థల నుంచి పరిహారం ఇప్పించలేకపోయిన నారాయణసామి, వైద్యలింగంలు యానాంలో అభివృద్ధి జరగలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం జమ అయిందన్నారు. ముఖ్యంగా యానాంలో విద్యుత్ చార్జీల పెంపు కేంద్ర పరిధిలోని జాయింట్ రెగ్యులేటరీ అథారిటీ తీసుకున్న నిర్ణయమన్నారు. దేశవ్యాప్తంగా జరిగే విధాన నిర్ణయాలకు తమ ప్రభుత్వాన్ని బాధ్యుల్ని చేయడం సరికాదన్నారు.

18అంగుళాల పుంగనూరు గిత్త
పి.గన్నవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ముంగండ గ్రామంలో మేలు జాతికి ఆవుకు పుంగనూరు గిత్తకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన చేగొండి సత్యనారాయణ కమతంలో మేలు జాతి ఆవుకు 18 అంగుళాల ఎత్తు గల దూడ జన్మించింది. ఈ సందర్భంగా పుంగనూరు గిద్దదూడను చూడడానికి సమీప పాడి రైతులు ఆసక్తి చూస్తున్నారు.



లీగల్ సర్వీసు కమిటీ సర్వే
ముమ్మివరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజోతి): ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసు కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. పారా మిలటరీ వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది బృందంగా ఏర్పడి మండలంలోని గేద్దెలంక, ఐ.పోలవరం మండలం పశువుల్లంక, కాట్రేనికోన మండలం పెనుమళ్ల గ్రామాల్లో 18ఏళ్లలోపు అంగవైకల్యం ఉన్నవారిని గుర్తించి వారికి ప్రభుత్వ సదుపాయాలు అందుతున్నాయా లేదా అనే విషయంపై ఆరా తీశారు. సదరన్ సర్టిఫికెట్లు లేని వారిని గుర్తించి వారిని సదరన్ క్యాంపునకు సిఫార్సుచేశారు. గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పారా మిలటరీ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి
బెర్ములు ఏర్పాటు చేయాలని వినతి


ప్రమాదకరంగా తయారైన అప్పనపల్లి వెళ్లే రహదారి

మామిడికుదురు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు నుంచి అప్పనపల్లి ఉచ్చులవారిపేటకు వెళ్లే రహదారి మధ్యలో రోడ్డు ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆగస్టులో సంభవించిన వరదలకు రోడ్డుకు ఇరువైపులా వేసిన బెర్ములు కొట్టుకుపోయి రోడ్డు ప్రమాదకరంగా తయారైందని పేర్కొంటున్నారు. అనుకోని పరిస్థితుల్లో రోడ్డు దిగితే గాయాల పాలవడం ఖాయమని, రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు భయాందోళనలతో ప్రయాణాలు చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా బెర్ముతో పాటు రోడ్డు కింద ఉన్న మట్టి కూడా క్రమేణా తరిగిపోవడం వల్ల రోడ్డు మధ్యలో విరిగిపోయే ఆస్కారం ఉందని స్థానికులు తెలియచేస్తున్నారు. నిత్యం ఈరోడ్డుపై పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి బాలబాలాజీ దర్శనానికి వెళ్లే భక్తులు ప్రయాణం చేస్తారు. కావున ప్రమాదకరంగా తయారైన రహదారిని అధికారులు ఇప్పటికైనా స్పందించి కొట్టుకుపోయిన బెర్ములస్థానే కొత్తగా బెర్ములు ఏర్పాటుచేసి ప్రజల భయాందోళనలు తగ్గించాలని కోరుతున్నారు.

బీజేపీ కార్యాలయానికి రెండు సెంట్ల భూమి విరాళం
అంతర్వేది, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గొంది గ్రామంలో బీజేపీ కార్యాలయం నిర్మాణానికి రూ.6లక్షలు విలువైన రెండు సెంట్ల భూమిని బీజేపీ రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు విరాళంగా ప్రకటించారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన పార్టీ మండల సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమి వితరణ చేయడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేసి చెంపాటిని అభినందించారు. రుద్రరాజు రామకృష్ణంరాజు, బొమ్మిడి నరసింహస్వామి, యనముల బాబ్జి, వడాల శివప్రసాద్, రాపూరి బాబ్జి, బోనం నాయుడు, గుబ్బల నాగరాజు, మాలే వెంకట్రావు, వాసుకూరి వెంకటేశ్వరరావు, పోతురాజు నాగరాజు, 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ప్రకటించారు.


రెండు సెంట్ల భూమిని బీజేపీ కార్యాలయానికి ఇస్తున్న చెంపాటి శివరామకృష్ణంరాజు

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న ఎంఎల్‌సీ తోట, జడ్పీటీసీ అబ్బు తదితరులు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లూరులో ఈనెల 17న నిర్వహించే సీతారామ, అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం పలు పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠ సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజలను పెదపూడి లక్ష్మీ జనార్దన మూర్తి, వారి కుమారుడు సీతారామాచార్యులు అధ్వర్యంలో పెద్దింటి లక్ష్మణాచార్యులు బ్రహ్మత్వంలో జరిపారు. సాయంత్రం పుట్ట మట్టి తెచ్చుట, విశ్వక్సేన పూజ, యాగశాల ప్రవేశం తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. సోమవారం ఉదయం శ్రీభక్తాంజనేయ స్వామి నూతన ఆలయ శిలామయ విగ్రహ, లోహమయ శిఖర, శిలామయ గణపతి సుబ్రహ్మణ్య స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ తోట త్రిమూర్తులు, జడ్పీటీసీ వి.అబ్బు, సర్పంచ్ కె.ఉదయశ్రీ తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో ముగిసిన సప్తాహం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకోరుమిల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో శనివారం నాల్గవ సప్తాహ భజనను నిర్వహించారు. ముగింపు రోజును పురస్కరించుకుని శనివారం టేకి గ్రామానికి చెందిన భజన కళాకారుడు కె.గంగన్నకాపు దంపతులను, ఆయన శిష్య బృందం ఆధ్వర్యంలో సువర్ణ సింహ తలాట కంకణధారణ జరిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సప్తాహాలు, ఏకాహాల్లో ఆయన పాల్గొని అపర రామదాసుగా పేరొందారని వక్తలు తెలిపారు. అనంతరం శిష్య బృందం, అభిమానులు, గ్రామపెద్దలు గంగన్నకాపు దంపతులను గజమాలలతో సత్కరించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన గంగన్నకాపు శిష్య బృందం, సహచర భజన కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



చినకోరుమిల్లిలో గంగన్నకాపు దంపతులను సన్మానిస్తున్న శిష్య బృందం

వైభవంగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అలమూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం నర్సిపూడిలో పునర్నిర్మాణం చేసిన కోదండ రామస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా జరిపారు. మూడు రోజులుగా జరుగుతున్న హోమాలు, ప్రత్యేక పూజల అనంతరం సీతారామస్వామి, లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను వేద పండితుల మంత్రాల మధ్య విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ దునే స్వామినాయుడు అధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, అన్నసమారాధన చేశారు.



ప్రత్యేక అలంకరణలో కోదండరామ స్వామివారు



ఆత్రేయపురంలో పునాదికే పరిమితమైన రైతు సేవా కేంద్రం

అసంపూర్తిగా రైతు సేవా కేంద్రం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురంలో రెండేళ్ల క్రితం నిర్మాణంలో ఉన్న రైతు సేవా కేంద్రం నేటికీ పునాదికే పరిమితమైంది. పంచాయతీ పాత భవనాన్ని కూలగొట్టి రైతుభరోసా కేంద్రానికి గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.22లక్షలతో ఈ దీని నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. రెండేళ్లు పూర్తి కావస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ సగంలోనే వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అసంపూర్తిగా దర్శనమిస్తున్నది. రైతులకు ఎంతో ఉపయోగపడే దీని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మండపల్లి-కొత్తపేట రోడ్డులో ఆక్రమించుకున్న దుకాణాలు

ఆక్రమణల చెరలో మండపల్లి ప్రధాన రహదారి

• వాహనదారుల ఇబ్బందులు • పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

కొత్తపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండపల్లి నుంచి కొత్తపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఆక్రమణలు అధికమవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండపల్లి రోడ్డులో నిత్యం వందలాది వాహనదారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. రావులపాలెం నుంచి అమలాపురం వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో మండపల్లి సెంటర్‌కు వచ్చేసరికి ఆక్రమణలతో రోడ్డు ఇరుకుగా ఏర్పడటంతో వాహనాలు తప్పించుకునే మార్గం తక్కువగా ఉండటంతో తరచూ పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతి శనివారం శనేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు ఇతర ప్రాంతాల నుంచి వాహనాలతో వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ కష్టాలు ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట కాలువలను ఆనుకుని ఈ ఆక్రమణలు ఒకదాని వెంబడి ఒకటి వెలసిపోవడంతో ఇబ్బందులు మరింత పెరిగాయి. ఏ ఒక్కరికి ఆర్‌అండ్‌బీ అధికారులు నోటీసులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో ఇటీవల పదుల సంఖ్యలో ఆక్రమణలు పెరిగిపోయాయి. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించకపోతే మున్ముందు ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని స్థానికులు, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

చీరకు నిప్పంటుకుని మహిళకు గాయాలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మహిళ చీరకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన చిట్టూరి లక్ష్మీకాంతం ఇంట్లో పెట్రోల్ బాటిల్ కిందపడి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఇంటి వద్ద కిరాణా షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఈమె పెట్రోల్ బాటిల్ కింద పడి మంటలు వ్యాప్తి చెంది తీవ్రంగా గాయపడిందన్నారు. ఈమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఆమె కుమారులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా ఇద్దరు కుమారులు స్వల్పంగా గాయపడ్డారు. రాత్రి సమయంలో 108లో కొత్తపేట ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ఆసుపత్రిలో ముగ్గురు చికిత్స పొందుతుండగా, లక్ష్మీకాంతం పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆసుపత్రి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరం శివారున పేకాట శిబిరంపై పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు.

లోడు లారీలతో ప్రయాణికులకు ఇక్కట్లు

• రూటు మార్చాలని వాహనదారుల వినతి • యథేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

కె.గంగవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న భారీ వాహనాల రూటు మార్చాలని కూళ్ల తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గోదావరి నది పరీవాహక గ్రామాల్లో తాతపూడి, కపిలేశ్వరపురం వద్ద ఇసుక ర్యాంపులు ఉన్నాయి. ఈ ర్యాంపుల నుంచి ఇసుక లారీలు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలతో పాటు కాకినాడ జిల్లాలోని చాలా ప్రాంతాలకు తరలిస్తున్నారు. తాతపూడి, కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపుల్లో లోడు చేసుకున్న లారీలు ఏటిగట్టు నుంచి కోటిపల్లి వచ్చి అక్కడ నుంచి కాకినాడ పరిసర ప్రాంతాలకు వెళుతున్నాయి. మరి కొన్ని కూళ్ల వరకూ ఏటిగట్టన వచ్చి అక్కడ నుంచి కూళ్ల-పామర్రు మీదుగా రామచంద్రపురం నియోజకవర్గంలో పలు గ్రామాలకు ఇసుకను సరఫరా చేస్తున్నాయి. కాగా ఏటిగట్టు రహదారి, కూళ్ల-పామర్రు రహదారి సింగిల్ రోడ్డు కావడంతో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇసుక లారీలతో రహదారులు పాడవుతున్నాయని, భారీ వాహనాలు వస్తే రోడ్డు మార్జిన్ కూడా ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులకు నోచుకోక సింగిల్ రోడ్లు అధ్వానంగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటి గుంతలు పూడ్చే పని చేపట్టింది. ఈ పరిస్థితుల్లో ఇసుక లారీలు ఈ రోడ్లపై తిరిగితే రోడ్లు వెంటనే పాడవుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏటిగట్టు వద్ద రోడ్డు ఎక్కిన లారీలు వాటిపై ఎక్కువ దూరం ప్రయాణించకుండా ప్రభుత్వం చర్యలు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



కూళ్ల-ఏటిగట్టు రహదారిలో ప్రయాణిస్తున్న ఇసుక లారీ

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

రావులపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. వీటిని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభి రామారావు, కాసా సాగర్, వెలగల శ్రీనివాసరెడ్డి, సాధనాల శ్రీను, గుర్రం నాగభూషణం, నందం వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరులో వరసిద్ధి వినాయకస్వామి వార్షికోత్సవం సందర్భంగా శనివారం గణపతి హోమం, విశేష పూజలు చేశారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, మహన్యాస పఠనం, వరసిద్ధి వినాయకస్వామికి ఏకాదశ ద్రవ్యాలతో అభిషేకాలు, స్వామివారికి గరికపత్రిపూజ, అలంకరణ, మహానివేదన, స్వామివారి సర్వదర్శనం, తదితర పూజలను జోష్య భట్ల వెంకట గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రామన్



అలమూరు మండలం పెదపళ్లలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేస్తున్న డాక్టర్ ప్రవీణ్

స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంకటరామన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మెర్లపాలెం గ్రామంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రచారం చేశారు.



మండపేటలో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

చీపుర్లు పట్టిన వైద్యులు

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణ, మండలంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జరిపారు. ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై ప్రదర్శన జరిపారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ చీపురుపట్టి పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ర్యాలీ నిర్వహించారు. మోడరన్ కళాశాలలో విద్యార్థులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో కె.రత్నకుమారి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమారి, ఈవోపీఆర్డీ ఆర్‌ఎంవీవీఎస్ ఈశ్వరరావు, పరిపాలనాధికారి జి.రాజేంద్రప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో జె.మల్లికార్జునుడు, ఎంఈవో కె.తాతారావు, మండల ఇంజనీరింగ్ అధికారి డీవీ రామపులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచి మొక్కలు నాటారు. పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ జరిపి అవగాహన కల్పించారు.

ద్వారపూడిలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ ర్యాలీ

మండపేట(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆధ్వర్యంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, మెప్మా, పారిశుధ్య సిబ్బంది శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ద్వారపూడిలో పంచాయతీ కార్యదర్శి ఆకుల వీ.వీ.రమణ సారథ్యంలో గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీ జరిపారు. గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుతామని సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు గ్రామంలో ర్యాలీ జరిపారు.

అలమూరు (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అలమూరు మండలంలో శనివారం నిర్వహించారు. పలు గ్రామాలలో స్వచ్ఛాంధ్ర ర్యాలీలు జరిపారు. మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. పెదపళ్లలో చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ చేసి గ్రామంలో శుభ్రతపై అవగాహన కల్పించారు. చొప్పెల్లలో సర్పంచ్ దంగేటి చంద్రకళ, కార్యదర్శి విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ జరిపి, అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు.



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న బ్రాంచ్ మేనేజర్

బీమా యోజన అందచేత

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనలో భాగంగా మృతి చెందిన కుటుంబానికి ఎస్‌బీఐ రూ.2 లక్షల బీమా సొమ్మును అందించారు. ఆత్రేయపురం ఎస్‌బీఐ శాఖ పరిధిలోని ఉచ్చిలికి చెందిన ఉర్రింకల భువనేశ్వరి (28) మృతి చెందారు. బీమా యోజనలో భాగంగా ఆమె భర్త చంద్రశేఖర్‌కు శనివారం రూ.2లక్షల బీమా చెక్కును బ్యాంకు సర్వీస్ మేనేజర్ శ్రీనివాసరావు అందించారు. ప్రధానమంత్రి జీవన్‌యోజన బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్రపై విద్యార్థులకు అవగాహన

రావులపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిసరాల శుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.



బీజేపీ నూతన మండల కమిటీ

బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి

కొత్తపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలో మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా యిళ్ళ పల్లంశెట్టి, నబ్బువరపు సత్యనారాయణ, పాలూరి వెంకటలక్ష్మి, కోటిపల్లి సుబ్బలక్ష్మి, కేశవరపు సత్యనారాయణ, దొడ్డిపట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శిగా ఐళ్ల ములాస్వామి, సురవరపు సాయిప్రకాష్, కార్యదర్శులుగా వల్లభశెట్టి కిరణ్, నాగసత్యమణి, వీరంకి సుందరామయ్య, అల్లపల్లి సత్యనారాయణ, కసిరెడ్డి ఝాన్సీ, నల్లా వరప్రసాద్, మండల కోశాధికారిగా గ్రంధి నాగేశ్వరరావులను నియమించినట్లు మండల అధ్యక్షుడు సపంతి కనకేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొలకోటి వెంకటేశ్వరరావు, పాలూరి జయప్రకాశ్‌నారాయణ, భమిడిపాటి లక్ష్మీనారాయణ, అన్నం సత్యనారాయణ, అవసరాల దివ్య తదితరులు పాల్గొన్నారు.

18అంగుళాల పుంగనూరు గిత్త

పి.గన్నవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ముంగండ గ్రామంలో మేలు జాతికి ఆవుకు పుంగనూరు గిత్తకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన చేగొండి సత్యనారాయణ కమతంలో మేలు జాతి ఆవుకు 18 అంగుళాల ఎత్తు గల దూడ జన్మించింది. ఈ సందర్భంగా పుంగనూరు గిత్తదూడను చూడడానికి సమీప పాడి రైతులు ఆసక్తి చూపుతున్నారు.



కె.గంగవరం మండలం శివలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

'కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించండి'

కె.గంగవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కూటమి నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం యర్రపోతవరం, శివల, దంగేరు, కోటిపల్లి, కె.గంగవరం తదితర గ్రామాల్లో పట్టభద్రుల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. మండలంలోని పలు పాఠశాలలకు విశ్రాంత ఉపాధ్యాయులు వెళ్లి కూటమి అభ్యర్థి విజయానికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు యర్రపోతవరం డీసీ అధ్యక్షులు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, దంగేరు మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి, రవి, సలాది రమేష్, మేడిశెట్టి రవికుమార్, మేడిశెట్టి పుణ్యమూర్తి, కర్రి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం రామచంద్రపురంలో పలు విద్యా సంస్థలో టీడీపీ సీనియర్ నాయకుడు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం ప్రచారం చేశారు. కూటమి బలపరచిన పేరాబత్తుల రాజశేఖర్ అందరివాడని ఆయనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

మండపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం వెలగతోడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...తమ హైస్కూల్‌కు చెందిన పి.ప్రణవి, ఎస్.సుప్రజ, రమణి, ఈశ్వర వరప్రసాద్, ఎస్.అబ్దుల్ నజీర్ కె.వెంకట సుభాష్ ఎంపికయ్యారని వారు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ, సహచర ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. ఉపకార వేతనానికి అర్హత పొందిన వారికి ఏడాదికి సంవత్సరానికి రూ.12,000 వంతున నాలుగేళ్లపాటు రూ.48,000 కేంద్ర ప్రభుత్వం అందిస్తుంద న్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ఎస్.శ్రీనివాసరావు, ఎంఎం అలీ, ఆర్.యేసు రాజు, సాయిబాబు, వీరభద్రరావు, జనార్దనరావు, సపీర్, సహదేవుడు, ఎం.అనంద రాజు రత్న కుమారి తదితరులు వున్నారు.



స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన వెలగతోడు ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు



కె.గంగవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

కిశోర వికాశంపై విద్యార్థినులకు అవగాహన

కె.గంగవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ ఆధ్వర్యంలో కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర అంశాలను తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పార్వతి, అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపుల్లో జోరుగా మద్యం అమ్మకాలు

అల్లవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ధరల కిక్‌తో బెల్టు షాపుల ద్వారా జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గుడి, బడి, నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నా ఎక్సైజ్ పోలీసు శాఖల దాడులు లేవని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి. రామేశ్వరం, రెబ్బనపల్లి, ఓడలరేవు తదితర తీర గ్రామాల్లో మద్యం బెల్టు షాపులకు లక్షల రూపాయల్లో వేలం పాటలు నిర్వహించినా ఎవరూ పట్టించుకోక ఆయా గ్రామాల్లో యానాం నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. క్వార్టర్ సీసాకు రూ.50 నుంచి రూ.70 అదనంగా వేసి ఓపెన్ ఎయిర్ బార్ షాపుల్లా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దేవగుప్తం, ఓడలరేవు, గుడ్డివానిచింత, అల్లవరం, డి.రావులపాలెం, ఎస్.పల్లిపాలెం, రెబ్బనపల్లి గ్రామాల్లో మద్యం అమ్మకాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. బెండమూర్లంక, కొమరగిరిపట్నం, అల్లవరం మద్యం లైసెన్సు షాపుల వద్ద రోడ్లపై వాహనాలు పెట్టడంతో ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మద్యం బెల్టు షాపులను అరికట్టాలని ప్రభుత్వ ఉన్నతాధికారులకు మహిళా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. విచ్చలవిడిగా మద్యం అమ్మకాల వల్లే అల్లవరం మండలంలో దొంగతనాలు పెరిగిపోయాయని ఆందోళన చెందుతున్నారు.